క్లుప్తంగా

ముమ్మరంగా డ్రైనేజీ నిర్మాణ పనులు



నాగటూరులో జరుగుతున్న డ్రైనేజీ నిర్మాణ పనులు

నందికొట్కూరు రూరల్ : నందికొట్కూరు మండల పరిధిలోని నాగటూరు గ్రామంలో ఎంపీపీ నిధులతో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ చెవుల సుజాత ఆధ్వర్యంలో పనులు చేపట్టినట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు సుజిత్ రెడ్డి తెలిపారు. గ్రామంలో డ్రైనేజీ నిర్మాణ పనులు చేపట్టడంతో గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నాన్నారు.

చర్చి నిర్మాణానికి రూ.50వేలు విరాళం



చర్చి సంఘం పెద్దలకు నగదు అందజేస్తున్న కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్

పాములపాడు: మండలంలోని బానకచెర్ల గ్రామంలో సీఎస్‌ఐ చర్చి నిర్మాణానికి బుధవారం కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్ రూ.50వేలు విరాళంగా ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కుల, మతాలకతీతంగా ప్రజలకు సహాయ సహకరాలు అందించడానికి ఎల్లప్పుడూ ముందుంటానన్నారు. ప్రతి ఒక్కరూ సేవా గుణాన్ని అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వేల్పుల ఆనంద్‌కుమార్ యువ సైన్యం శంకర్‌గౌడు, సంజీవరాయుడు, ఎల్లగౌడు, సిద్దుగౌడు, గోవింద్‌గౌడు తదితరులు పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారానికి కృషి



దామగట్ల స్వాములు

నందికొట్కూరు: నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఆ సంఘం నూతన పట్టణ అధ్యక్షులు దామగట్ల స్వాములు అన్నారు. బుధవారం పట్టణంలోని త్యాగరాజు దేవాలయంలో పట్టణ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన మాట్లాడుతూ పట్టణంలో 400 నాయీబ్రాహ్మణుల కుటుంబాలు ఉన్నాయని, వారి సమస్యల పరిష్కారమే అజెండాగా పని చేస్తానన్నారు. నూతన కమిటీ కార్యదర్శిగా డిష్ వెంకటేశ్వర్లు, కోశాధికారులు కొక్కెరంచ నాగరాజు, మురళి, కార్యవర్గ సభ్యులుగా డైమండ్ శ్రీను, కల్లూరు ధనాంజనేయులు, మురళి, ఎండీ రమణ, పారుమంచాల మధు ఎన్నికయ్యారు.

నల్లమలలో గుర్తుతెలియని వ్యక్తి మృతి



మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

మహానంది: నల్లమల అడవిలోని పాలేరువాగు వెంట ఉన్న ఉసిరిక వనం సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. సుమారు 45 నుంచి 50 ఏళ్ల మధ్యలో ఉన్న ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న మహానంది ఎస్‌ఐ నాగేంద్రప్రసాద్, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేవలం షర్టు ధరించి ఉన్నాడని, మతి స్థిమితం లేక నల్లమలలోని వచ్చి ఉంటారని, ఆకలితో అలమటిస్తూ మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. అతను ఎవరు, ఎక్కడి నుంచి వచ్చాడు, ఏ ప్రాంతానికి చెందినవాడనే వివరాలు తెలియాల్సి ఉంది.

రబీలో వరి పంటలు వేయొద్దు



రైతులతో మాట్లాడుతున్న ఏడీ రాజశేఖర్

మహానంది: రిజర్వాయర్లలో నీటి నిలువలు లేనందున రబీ పంటలకు కాల్వల ద్వారా సాగునీరు విడుదలయ్యే అవకాశాలు ఉండవని, రైతులు వరి పంటలు వేసుకోవద్దని నంద్యాల జిల్లా వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజశేఖర్ విజ్ఞప్తి చేశారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె, తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఆయన మాట్లాడుతూ బోరు సౌకర్యం ఉన్న రైతులు సైతం వరి కాకుండా ఆరుతడి పంటల వైపు మొగ్గు చూపితే ప్రయోజనం ఉంటుందన్నారు. ఆయనతో పాటు కేసీ కెనాల్ అధికారులు ఈర్నపాడు, పార్నపల్లె గ్రామాల్లో పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. కాలువల వెంట విద్యుత్ మోటార్ల ద్వారా నీటిని తరలించొద్దన్నారు. బండిఆత్మకూరు ఉప సర్పంచ్ అవుటాల నాగేశ్వరరెడ్డి, ఏఓ స్వాతి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

‘గడప గడప’కూ అభివృద్ధి

- సచివాలయాల పరిధిలో సమస్యల పరిష్కారం
- కాలనీల్లో రోడ్లకు మహర్దశ
- తొలగిన డ్రైనేజీ సమస్యలు





మారుతీనగర్ కాలనీలో వేసిన రోడ్డు



డ్రైనేజీ నిర్మాణం

నందికొట్కూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం పూర్తయిన తరువాత పట్టణంలోని రహదారులకు మహర్దశ పట్టింది. ప్రతి సచివాలయానికి రూ.20లక్షలు గడప గడప నిధులు మంజూరు చేయడంతో పాటు మున్సిపల్ నిధులతో ఆయా వార్డుల పరిధిలో దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు పరిష్కారం లభించింది. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లో సీసీ రోడ్లతో పాటు డ్రైనేజీల నిర్మాణం చేపట్టారు.

మారుతీనగర్‌లో సమస్యల పరిష్కారం

నందికొట్కూరు మున్సిపాలిటీ పరిధిలో 29 వార్డులు, 14 సచివాలయాలు ఉన్నాయి. పట్టణంలోని అన్ని వార్డులో గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం పూర్తయ్యింది. కాగా పట్టణంలో వైఎస్సార్ పాలనలో మంజూరు చేసిన మారుతీనగర్‌ను ఆయన మరణాంతరం వచ్చిన ప్రభుత్వాలు పట్టించుకోలేదు. దీంతో ఆ కాలనీలో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు కనీస వసతులు లేక అల్లాడుతున్నారు. అయితే కాలనీలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన సమయంలో స్థానికులు ఎమ్మెల్యేకు తమ సమస్యలను విన్నవించారు. దీంతో ఆయన గడప గడపకు మన ప్రభుత్వం నిధులు కేటాయించి సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టి సమస్యను పరిష్కరించారు.

మున్సిపల్ నిధులతో మరింత అభివృద్ధి

గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పాటు మున్సిపల్ నిధులను కలిపి పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టారు. పట్టణంలో 29 వార్డులకు గాను 14 సచివాలయాలకు గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం కింద రూ. 2. 80 కోట్లు, మున్సిపాలిటి నిధులు రూ. 3.33 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు వంటి అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి.

నరకం అనుభవించాం



దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పాలనలో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు మంజూరు చేయడంతో మారుతీ నగర్‌లో ఇల్లు కట్టుకున్నాం. అప్పటి నుంచి ఇప్పటి వరకు రోడ్లు, డ్రైనేజీలు, కుళాయిలు లేక 20 ఏళ్ల నుంచి నరకయాతన పడ్డాం. ఇటీవల గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సమస్యలు చెప్పడంతో వెంటనే సీసీ రోడ్లు, డ్రైనేజీలు వేశారు.

– మేరమ్మ, మారుతీనగర్

వేగంగా అభివృద్ధి పనులు



పట్టణంలోని అన్ని వార్డులకు గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో పాటు మున్సిపల్ నిధులు, 15 ఆర్థిక నిధులు కూడా మంజూరయ్యాయి. దీంతో పట్టణంలోని రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు వేగంగా చేయించాం. నిధుల కొరత లేకపోవడంతో పట్టణంలోని చిన్న, చిన్న సమస్యలకు పరిష్కారం త్వరితగతిన లభించింది.

– కమిషనర్ కిషోర్, నందికొట్కూరు

కొత్త పనులు గుర్తించండి

కొత్తపల్లి: మండలంలోని అన్ని గ్రామాలలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి కొత్త పనులు త్వరగా గుర్తించాలని ఏపీఓ షేక్ రేష్మ సూచించారు. బుధవారం స్థానిక ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వారంలోపు కొత్తపనుల గుర్తింపు పూర్తిచేయాలని చెప్పారు. అదేవిధంగా ఆధార్ అథంటికేషన్ కూడా పూర్తిచేయాలని చేయని వారికి జిల్లా అధికారుల నుంచి మెమోలు ఇవ్వడం జరుగుతుందన్నారు. 80 నుంచి 100 రోజులు పనులు పూర్తి చేసుకునేందుకు దగ్గరగా ఉన్న కుటుంబాలకు పని దినాలు త్వరగా పూర్తిచేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు.

30న మున్సిపల్ సర్వసభ్య సమావేశం

ఆత్మకూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఈ నెల 30న పురపాలక సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. సమావేశంలో వచ్చే ఏడాది నూతన బడ్జెట్‌పై తీర్మానం చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమానికి వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సభ్యులు పాల్గొనాలని కోరారు.

మల్లన్న సేవలో దేవదాయశాఖ మంత్రి



మల్లన్న దర్శనార్థం వస్తున్న మంత్రి కొట్టు సత్యనారాయణ దంపతులు



దేవదాయ కమిషనర్‌కు స్వామిఅమ్మవార్ల జ్ఞాపికను అందజేస్తున్న చైర్మన్, ఈఓ

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జున స్వామివార్లను బుధవారం దేవదాయశాఖ మంత్రి, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ఈఓ డి.పెద్దిరాజు, అర్చకులు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో అర్చకవేదపండితులు ఆశీర్వచనాలు పలుకగా, ఈఓ స్వామివార్ల శేషవస్త్రాలు, లడ్డూ ప్రసాదాలు, జ్ఞాపికను అందజేశారు.

మల్లన్నను దర్శించుకున్న దేవదాయశాఖ కమిషనర్

శ్రీశైలశ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్లను బుధవారం దేవాదాయశాఖ కమిషనర్ ఎస్ సత్యనారాయణ దర్శించుకున్నారు. వీరికి ప్రధానాలయ రాజగోపురం వద్ద దేవస్థానం ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌రెడ్డి చక్రపాణిరెడ్డి, ఈఓ డి.పెద్దిరాజు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు. అనంతరం వీరు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.

టీడీపీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి

- డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ

టీడీపీకి అభ్యర్థులు దొరకని పరిస్థితి నెలకొందని, అందుకే ఇప్పటికీ చాలా నియోజకవర్గాల్లో అయోమయం నెలకొందని డిప్యూటీ సీఎం, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. బుధవారం ఆయన శ్రీశైలంలో మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు ప్రజలను నమ్ముకోలేదని, డబ్బు మూటలతో రాజకీయం చేయాలనుకుంటున్నారన్నారు. అందుకే అభ్యర్థుల్లో ఎవరు డబ్బు బాగా ఖర్చు పెడతారనే విషయానికే ప్రాధాన్యత ఇస్తున్నాడన్నారు. రాష్ట్రంలోని అన్ని ప్రముఖ ఆలయాల అభివృద్ధికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.1600 కోట్లు వెచ్చిస్తోందన్నారు. గత 5 సంవంత్సరాల్లో టీడీపీ ప్రభుత్వం ఏమి ఖర్చు పెట్టిందో చెప్పాలని ప్రశ్నించారు. టీడీపీ హయాంలో ఉన్న దేవాలయాలను జేసీబీ, పొక్లెయిన్లతో కూల్చివేశారన్నారు. సీఎం జగన్ ప్రజలపై, దేవుడిపై మాత్రమే ఆధారపడతారని తెలిపారు. ఇవాళ మేము గేట్లు ఓపెన్ చేస్తే చంద్రబాబు సగం సీట్లలో పోటీ చేసేందుకు కూడా అభ్యర్థులు దొరకరన్నారు. కాపు సామాజిక వర్గం తలదించుకునేలా పవన్ వ్యవహరిస్తున్నాడని, ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు.

ఇరువర్గాలపై కేసు నమోదు

పాములపాడు: మండలంలోని వాడాల గ్రామంలో చర్చీ వద్ద చందాల విషయంలో ఘర్షణకు పాల్పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ అశోక్ బుధవారం తెలిపారు. ఈ నెల 24 రాత్రి క్రిస్మస్ పండుగ సందర్భంగా సంఘం పెద్దలు చందాల విషయంలో వర్గాలుగా ఏర్పడి ఒకరిపై ఒకరు ఘర్షణకు పాల్పడ్డారన్నారు. ఈ ఘటనలో వంకా ప్రభాకర్ ఫిర్యాదు మేరకు ప్రతాప్, సుబ్బయ్య, మురారి ప్రతాప్, చంద్రోశేఖర్, అనిల్, చంద్రపాల్, ఏసేపు, రత్నం, ఎర్రన్న, వెంకటరమణలపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే మరో వర్గం వంకా వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు అభినయ్, చెన్నయ్య, సునిత, ప్రభాకర్, సుదర్శనం, ప్రకాష్, త్యాగరాజు, ఎలీష, సూర్యబాబుల పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెల్లడించారు.

వైఎస్సార్ బీమా పేదలకు అండ

మహానంది: గాజులపల్లె మజరా గ్రామమైన ఆంజనేయపురం గ్రామానికి చెందిన మాన్ల వెంకటరమణ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. దీంతో వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మృతుడి భార్య అచ్చమ్మకు బుధవారం రూ. 10వేలు సహాయం అందించారు. గోపవరం సొసైటీ చైర్మన్ వి.రామకృష్ణుడు, వెల్ఫేర్ అసిస్టెంట్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు పథకాలు అందేలా చూడాలి



సమావేశం నిర్వహిస్తున్న పీఓ రవీంద్రారెడ్డి

శ్రీశైలంప్రాజెక్ట్: ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసి న్యాయమహా అభియాన్ కార్యక్రమాన్ని గిరిజనులు సద్వినియోగం చేసుకునేలా ఐటీడీఏ అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ బి రవీంద్రారెడ్డి అన్నారు. బుధవారం సున్నిపెంటలోని యూత్‌ట్రైనింగ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పథకం అమలుపై సూచనలు చేశారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలోని ప్రకాశం, నంద్యాల, పల్నాడు జిల్లాల పరిధిలో నివసిస్తున్న ఆదివాసి చెంచుగిరిజనుల అభివృద్ధి పనులను పక్కాప్రణాళికతో పూర్తి చేయాలన్నారు. చెంచుగిరిజనులకు పక్కాగృహాలు, మెడికల్ యునిట్లు, వసతిగృహాలు, బోర్లు, విద్యుత్ సరఫరా , మంచినీటి సరఫరా అంగన్‌వాడీకేంద్రాల ఏర్పాటు, వందన్ వికాస కేంద్రాల ఏర్పాటు, గూడేలలో రోడ్ల నిర్మాణం వంటి పనులపై సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అలాగే వైఎస్సార్ క్రాంతి పథం , మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం వంటి పథకాల అమలు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఏపీఓ బీసీ ధనుంజయ, వైకెపీ ఇన్‌చార్జ్ కేజీ నాయక్, ఐటీడీఏ మేనేజర్ బి.వి శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల మంజూరు

జూపాడుబంగ్లా: మండలానికి నూతనంగా 60 పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ నూర్జహాన్ బుధవారం తెలిపారు. జూపాడుబంగ్లా గ్రామపంచాయతీకి 20, బన్నూరు 9, మండ్లెం 6, తంగడంచ 4, పారుమంచాల 10, తర్తూరు 1, తాటిపాడు 6, తరిగోపుల 4 చొప్పున మంజూరయ్యాయన్నారు. మంజూరైన పింఛన్ల పరిశీలన పూర్తికాగా లబ్ధిదారులకు జనవరి మాసంలో రూ.3వేలపింఛన్ అందజేస్తారన్నారు.

క్రికెట్ కిట్ల పంపిణీ



క్రికెట్ కిట్లను పంపిణీ చేస్తున్న శిల్పా కార్తీక్‌రెడ్డి

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పా కార్తీక్‌రెడ్డి క్రికెట్ కిట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 6న పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో నిర్వహిస్తున్న శ్రీశైలం నియోజకవర్గం స్థాయి కేపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ సందర్భంగా కిట్లను అందజేస్తున్నట్లు చెప్పారు. ఇప్పటికే క్రీడాకారులు పెద్ద సంఖ్యలో రిజిస్టర్ చేసుకున్నారని, జట్లుకు చెందిన క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్నామని చెప్పారు. క్రీడాకారులు క్రీడాపోటీలను క్రీడాస్ఫూర్తిగా తీసుకోవాలని చెప్పారు. ఆసక్తిగల జట్లు జనవరి రెండవ తేది లోపుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలని ,ఎలాంటి ఎంట్రీఫీజ్ లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సయ్యద్‌మీర్, శివరాం, జెడ్పీటీసీ సభ్యులు శంకర్‌రెడ్డి, పువ్వాడ భాస్కర్, లక్ష్మీరెడ్డి, బాలస్వామియాదవ్, నాగేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పట్టణంలోని మార్కెట్‌యార్డ్‌లో సివిల్‌సప్లై కార్మికులను బుధవారం వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ నాయకులు శిల్పాకార్తీక్‌రెడ్డి ఆత్మీయ కలయిక కార్యక్రమంలో పాల్గొన్నారు. హమాలీ కార్మికులకు ఏ అవసరం వచ్చినా..తాము అండగా ఉంటామని భరోసా కల్పించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ బాలస్వామియాదవ్ పాల్గొన్నారు.

కురుకుందలో నూతన ప్రార్థనా మందిరం ప్రతిష్ట

మండలంలోని కురుకుంద గ్రామంలో సెవంత్ డే ఎడ్వాంటెస్ట్ ప్రార్థనా మందిర ప్రతిష్ట కార్యక్రమంలో బుధవారం శిల్పాకార్తీక్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళలకు చీరలు పంపిణీలు చేశారు.

శాస్త్రోక్తంగా దేవాలయ పునఃప్రతిష్ఠ



అమ్మవారి విగ్రహాలకు ప్రతిష్ఠాంగ హోమములు నిర్వహిస్తున్న పురోహితులు

పగిడ్యాల: మండలంలోని కొత్త పాలమర్రి గ్రామంలో వెలసిన సుంకుల పరమేశ్వరి దేవాలయ జీర్ణోద్ధరణ పూర్వక పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు పురోహితులు అనిల్ స్వామి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈనెల 26 నుంచి ప్రారంభమైన దేవాలయ జీర్ణోద్ధరణ వేడుకల్లో భాగంగా బుధవారం ప్రాతఃకాల పూజ, యంత్రాభిషేకము, జపములు, గ్రామోత్సవము, ప్రతిష్ఠాంగ హోమములు, ప్రత్యేక పూజలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుత్వికులు వేదమంత్రాలు పఠిస్తుండగా పలువురు పుణ్యదంపతులు పూజలో పాల్గొని భక్తిని చాటుకున్నారు. గురువారం ప్రాతఃకాల పూజ, యంత్రప్రతిష్ఠ, విగ్రహ ప్రతిష్ఠ, బింబ కళాన్యాసం, కూష్మాండ ఛేదనం, కక్షాగ్నిజ్వాల, దర్శనం, మంగళహారతి, బలిదానం, మహాపూర్ణాహుతి, కలశోధక, యజమాన మార్జనం, తీర్థప్రసాద వినియోగములతో పూజా కార్యక్రమాలతో ప్రతిష్ఠ వేడుకలు ముగుస్తాయని అనిల్ స్వామి తెలిపారు.

నల్లమలలో అరుదైన జంతు, పక్షి జాతులు



మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన డీఎఫ్ఓ వినీత్‌కుమార్

మహానంది: నల్లమల అడవుల్లో అరుదైన వన్యప్రాణులతో పాటు జీవవైవిధ్యం ఎంతో బాగుందని, నల్లమల అడవులు ఆంధ్రప్రదేశ్‌కే గర్వకారణమని నంద్యాల జిల్లా ఫారెస్ట్ ఆఫీసర్ వినీత్‌కుమార్ తెలిపారు. కుటుంబ సభ్యులతో కలిసి వచ్చిన ఆయన ముందుగా శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు. అనంతరం స్థానిక పర్యావరణ కేంద్రం వద్ద ఆయన మాట్లాడుతూ నల్లమలను కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఎవరైనా అనుమతులు లేకుండా అడవులకు వెళ్లినా, నిప్పు పెట్టినా, వన్యప్రాణులను వేటాడినాకఠిన శిక్షలు ఉంటాయన్నారు. అనంతరం డీఆర్ఓ హైమావతి, ఎఫ్‌బీఓ ప్రతాప్, సిబ్బందితో వివిధ అంశాలపై చర్చించారు.

మహానందీశ్వరుడికి వెండి పాత్రల బహూకరణ



వెండిపాత్రలు అందిస్తున్న హరికృష్ణ దంపతులు

మహానంది: హైదరాబాద్ నగరానికి చెందిన గంటి హరికృష్ణ, పద్మజ దంపతులు మహానందీశ్వర స్వామి అభిషేకానికి రూ. 40 వేల విలువైన నాలుగు వెండి పంచపాత్రలు, ఒక వెండి చెంబు విరాళంగా అందజేశారు. బుధవారం వారు శ్రీ కామేశ్వరీ దేవి, మహానందీశ్వర స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం దాతలను ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వర రెడ్డి, ఆలయ ఈఓ కాపు. చంద్రశేఖర్ రెడ్డి, ధర్మకర్త గంగిశెట్టి మల్లికార్జునరావు, వేదపండితులు రవిశంకర అవధాని సన్మానించి ప్రసాదాలు అందించారు.

మరకతలింగేశ్వరుడికి అన్నాభిషేకం

మహానంది మండలం గాజులపల్లె రైల్వే స్టేషన్ గ్రామంలో కొలువైన శ్రీ గంగా, గౌరీ సమేత మరకత లింగేశ్వర స్వామి, నవగ్రహ దేవాలయాల్లో ఆరుద్రోత్సవం, పౌర్ణమి పురస్కరించుకుని బుధవారం పూజలు వైభవంగా నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు కనమర్లపూడి మస్తాన్ రావు ఆధ్వర్యంలో స్వామివారికి అన్నాభిషేకం, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన పూజలు శాస్త్రోక్తంగా చేపట్టారు.

సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా

పాములపాడు: సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని డీఎస్పీ శ్రీనివాసరావు ఆదేశించారు. బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌ను తనఖీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ స్టేషన్ పరిసరాలు, ఖైదీల బందీఖానా, ఆయుధాల గది, పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ లా అండ్ ఆర్డర్ కంట్రోల్‌లో ఉందన్నారు. ప్రధానంగా హైవే రోడ్డునిర్మాణ పనులు జరుగుతున్నందున రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిధిలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భార్య, భర్తల మనస్పర్థలు, భూ తగాదాలు ఎక్కువగా ప్రజల నుంచి ఫిర్యాదు వస్తున్నాయని చెప్పారు. కాగా తమ పరిధిలో ఉన్న వాటిని పరిష్కరిస్తున్నామని, మిగతావి కోర్టుకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జరుగ నున్న సార్వత్రిక ఎన్నికలకు పూర్తి సంసిద్ధంగా ఉన్నామన్నారు. ఆయన వెంట ఎస్‌ఐ అశోక్, పోలీసు సిబ్బంది ఉన్నారు.

రోడ్ల నిర్మాణం వేగవంతం చేయండి



రోడ్డు కొలతలు సేకరిస్తున్న ఈఈ రామకృష్ణారెడ్డి

జూపాడుబంగ్లా: తూడిచెర్ల, అలగనూరు, తిమ్మాపురం రోడ్ల నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని పంచాయతీరాజ్‌శాఖ పీఐయూ ఈఈ రామకృష్ణారెడ్డి కాంట్రాక్టర్లకు సూచించారు. బుధవారం ఆయన తూడిచెర్ల రోడ్డు నిర్మాణ పనులను పరిశీలించారు. పనుల్లో ఎక్కడా రాజీపడకుండా నాణ్యత ప్రమాణాలను పాటించాలని ఆదేశించారు. అలాగే పనులను నిరంతరం పర్యవేక్షిస్తుండాలని డీఈ, ఏఈ లకు ఈఈ సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పారుమంచాల నుంచి మద్దూరు వరకు 4.8 కోట్ల నిధులతో కొనసాగుతున్న బీటీ రోడ్డు, కేజీ రోడ్డు నుంచి వేంపెంట వరకు 3.50 కోట్లతో బీటీరోడ్డు, రూ.5.50 కోట్లతో పారుమంచాల–రోళ్లపాడు వరకు రోడ్డు నిర్మాణం, రూ.2.80 కోట్లతో నాగలూటి–కడుమూరు వరకు, రూ.6.50 కోట్ల వ్యయంతో పారుమంచాల–తిమ్మాపురం వరకు రోడ్డు నిర్మాణం పనులు కొనసాగుతున్నాయన్నారు. ఈ రోడ్ల నిర్మాణం పనులను వేగవంతం చేయించి 2024 ఫిబ్రవరి నెలాఖరులోగా పూర్తిచేయాలని కాంట్రాక్టర్లకు సూచించినట్లు తెలిపారు. అనంతరం ఆయన రోడ్డు కొలతలను సేకరించారు. ఈఈ వెంట డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ నారాయణరెడ్డి ఉన్నారు.

ఉత్సాహంగా ఆడుదాం..ఆంధ్ర క్రీడలు



బండిఆత్మకూరులో వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న భువనేశ్వరరెడ్డి, ఎంపీపీ సంజీవరెడ్డి



వేల్పనూరులో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీటీసీ జనాభారెడ్డి

నందికొట్కూరు: ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు ఉత్సాహంగా సాగుతున్నాయి. బుధవారం రెండో రోజు పట్టణంలోని గవర్నమెంట్ హైస్కూల్‌లో, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో, కుంట సమీపంలో, ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఆడుదాం..ఆంధ్ర పోటీలను మున్సిపల్ కమిషనర్ కిషోర్, తహసీల్దార్ రాజశేఖర్‌బాబు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మన్సూర్, కౌన్సిలర్లు క్రీడాకారులను పరిచయం చేసుకొని ప్రారంభించారు.

నందికొట్కూరు రూరల్ : బిజినవేముల జెడ్పీ హైస్కూల్ ఆవరణలో క్రీడాకారులకు వాలీబాల్, షటిల్ పోటీలను నిర్వహించినట్లు శాప్ కోఆర్డినేటర్ వీరన్న తెలిపారు.

పగిడ్యాల: పాత ముచ్చుమర్రి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా దుస్తుల పంపిణీ కార్యక్రమానికి జెడ్పీటీసీ పుల్యాల దివ్య, ఎంపీపీ మండ్ల మల్లేశ్వరి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

పాములపాడు:ఆడుదాం ఆంధ్రా క్రీడా టోర్నమెంటులో పాల్గొన్న క్రీడాకారుల నైపుణ్యాలు వెలికి వస్తాయని ఎంపీడీఓ గోపీక్రిష్ణ, తహసీల్దార్ రత్నరాధిక అన్నారు. బుధవారం రెండవ రోజు టోర్నమెంటులో భాగంగా స్థానిక ఏఎస్ఆర్ జెడ్పీహెచ్ స్కూలులో నిర్వహించిన ఆటల పోటీలను ప్రారంభించారు.

కొత్తపల్లి: ఆడుదాం ఆంధ్ర క్రీడాకారులకు వరం అని ఎంపీడీఓ మేరి అన్నారు. బుధవారం మండలంలోని గోకవరం, ఎదురుపాడు గ్రామాలలో జరుగుతున్న క్రీడాపోటీలను పరిశీలించారు.

శ్రీశైలంప్రాజెక్ట్: క్రికెట్ పోటీలను సున్నిపెంట గ్రామపంచాయతీ కార్యదర్శి బాలునాయక్ ప్రారంభించారు. సున్నిపెంట 1, 2 సచివాలయాల పరిధిలోని జట్లు క్రికెట్‌లో పాల్గొన్నాయి.

మహానంది: ప్రతిభ కలిగిన క్రీడాకారులను సీఎం జగన్‌మోహన్ రెడ్డి పోత్సహిస్తున్నారని, అందుకే ఆడుదాం ఆంధ్ర క్రీడలను ఏర్పాటు చేశారని వైఎస్సార్‌సీపీ శ్రీశైలం నియోజకవర్గ సీనియర్ నేత శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండల కేంద్రంలో బుధవారం ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలను ప్రారంభించారు. ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, మాజీ ఎంపీపీ దేసు వెంకటరామిరెడ్డి, సర్పంచ్ సంధ్య పాల్గొన్నారు.

వెలుగోడు: మండలంలోని వేల్పనూరు గ్రామంలో క్రీడా పోటీలను ఎంపీటీసీ సభ్యుడు బన్నూరు తోయ జనాభారెడ్డి ప్రారంభించారు. జెడ్పీ హైస్కూల్‌లో క్రీడాకారులను పరిచయం చేసుకొని క్రీడాకారులతో బ్యాడ్మింటన్ ఆడారు. ఎంపీటీసీ పల్లె వెంకటరామిరెడ్డి, గ్రామ కార్యదర్శి సుంకన్న పాల్గొన్నారు.